క్లుప్తంగా

29న మండల సమావేశం

బల్లికురవ: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో శాఖల వారీగా సమీక్షిస్తామన్నారు. సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నాణ్యమైన విత్తనాల ఎంపిక కీలకం



తమ్మవరంలో సూచనలు ఇస్తున్న ఏఓ శ్రీనివాసరావు

మేదరమెట్ల: బాగా పండిన పంట నుంచి తీసిన నాణ్యమైన విత్తనాలను సేకరించుకొని విత్తుకోవడం అలవాటు చేసుకోవాలని ఏఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తమ్మవరం గ్రామంలో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించారు.

ఘనంగా పోలేరమ్మ పొంగళ్లు



పొంగళ్లు చెల్లించేందుకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామంలో మంగళవారం గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్ల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ ఆనవాయితీ ప్రకారం ఉగాది పండుగ ముందుగా గ్రామంలోని ప్రజలు పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్లు చెల్లిస్తుంటారు. అదే మాదిరిగా ఈ ఏడాది కూడా గ్రామస్తులు పోలేరమ్మకు సద్దులు, పొంగళ్లు తీసుకొని సంప్రదాయం ప్రకారం గ్రామంలోని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మ వారి చెట్టు వద్ద తమ మొక్కులను చెల్లించుకొని పొంగళ్లను అమ్మవారికి సమర్పించారు.

వక్ఫ్ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలి



గద్దం మస్తాన్‌వలి

పర్చూరు(చినగంజాం): వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా కర్ణాటక అసెంబ్లీ తీర్మానం చేసిన విధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యదర్శి, బాపట్ల వక్ఫ్ బోర్డు కార్యదర్శి గద్దం మస్తాన్‌వలి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న ఈ నూతన వక్ఫ్ ఎమెండ్‌మెంట్ 2024 సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టీడీపీ, జనసేన పార్టీల్లో ఉన్న ముస్లిం మైనార్టీ నాయకులు తమ అధినేతలను ఈ బిల్లుపై నిలదీయాలని కోరారు.

31లోపు ఆస్తి పన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీ

చీరాల: పట్టణంలోని గృహ యజమానులు బాకాయిలున్న ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులను ఈనెల 31వ తేదీ లోపు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ లోపు బకాయిలను ఏక మొత్తంలో చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, పాల్గుణ మాసం ధనిష్ట నక్షత్రం ద్వాదశి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

జలం కాదు.. గరళం



మండలంలో మినరల్ వాటర్‌ప్లాంట్



వాటర్ ప్లాంటుల నుంచి ఆటోలో సరఫరా చేస్తున్న నీటి క్యాన్‌లు

- నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు
- మినరల్ వాటర్ పేరుతో మోసం
- ప్రభుత్వ పర్యవేక్షణ శూన్యం

మేదరమెట్ల:

శుద్ధ జలం అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతోంది. కొరిశపాడు మండలంలోని గ్రామాలకు రక్షిత మంచినీటి పథకాల ద్వారా తాగునీరు సరఫరా చేయడంలో అలసత్వం వహిస్తోంది. వారంలో మూడు నాలుగు రోజులే అరకొరగా సరఫరా అవుతుండటంతో ఎక్కువ మంది ప్రజలు మినరల్ వాటర్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇదే వ్యాపారులకు ఆదాయ వనరుగా మారింది. కనీస నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజలను మోసం చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. మినరల్ వాటర్ పేరుతో సాధారణ నీరు విక్రయిస్తూ అందినకాడకు దోచుకుంటున్నారు. మండలంలో ఇలాంటి వాటర్ ప్లాంట్లు ఎక్కడ పడితే అక్కడ వెలుస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. బోరు నుంచి తీసిన నీటినే క్యాన్‌లలో నింపి హోటల్స్, బడ్డీ కొట్లకు విక్రయిస్తున్నారు. ప్లాంటు నిర్వహించాలంటే ఐఎస్‌ఐ గుర్తింపు తప్పని సరిగా ఉండాలి. కానీ అలాంటి గుర్తింపు ఉన్న ప్లాంట్లు ఒక్కటీ లేకపోవడం శోచనీయం. మేదరమెట్లో దాదాపు ఏడు ప్లాంట్లు ఉండగా.. వీటిలో ఒక్కదానికీ గుర్తింపు లేకపోవడం గమనార్హం. కొరిశపాడు మండల కేంద్రంలో మూడు అనధికారిక ప్లాంట్లు వెలిశాయి. రావినూతలలో ఐదు ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కాగా మేదరమెట్లలో ఒక ప్లాంటుకు గుండ్లకమ్మ నీటిని పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసుకుంటున్నారు. కాగా మిగిలిన అన్ని ప్రాంతాల్లో బోరు నీటినే వినియోగిస్తున్నారు. ఈనీటిలో పలు రసాయనాలు.. స్వీట్నర్లు వాడుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ప్లాంట్ల నుంచి మండలంలో అన్ని గ్రామాలకు క్యాన్లలో నీటి సరఫరా జరుగుతోంది. పలు గ్రామాల్లో పెద్ద నీటి ట్యాంకులను బండ్లపై పెట్టుకొని వీధిల్లో తిరుగుతూ 20 లీటర్ల క్యాన్‌ను రూ.15 నుంచి రూ. 25 వరకు అమ్ముతున్నారు. ఎండలు ముదురుతుండటంతో ఈ రేట్లు ఇంకా పెరుగుతాయని జనం ఆందోళన చెందుతున్నారు.

పాటించాల్సిన నిబంధనలు ఇవీ..

- భారతీయ ప్రమాణాలు(ఐఎస్‌ఐ) అనుమతి పొందిన పత్రాన్ని ప్రదర్శనగా ఉంచాలి.
- పరిశ్రమల శాఖ నుంచి అనుమతి పత్రం ఉండాలి.
- ప్లాంటులో మైక్రోబయాలజీ, కెమికల్ ల్యాబ్ తోపాటు ఇద్దరు టెక్నీషియన్‌లు ఉండాలి.
- ప్రతి రోజూ నీటి పరీక్షలు నిర్వహించి రికార్డుల్లో నమోదు చేయడం.. నెలకోసారి పరీక్షలకు సంబంధించిన రికార్డులను అధికారులకు చూపించడం చేయాలి.

కొనుగోలు కేంద్రాల్లోనే శనగలు అమ్ముకోవాలి



ఇంకొల్లు: రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి



కేశవరప్పాడులో మాట్లాడుతున్న ఏఓ సుధీర్‌బాబు



యద్దనపూడి: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి మేరమ్మ

కేశవరప్పాడు (కారంచేడు): మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసి పండించిన శనగ పంటలను సమీప కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం కేశవరప్పాడు, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ. 5650కు నాయుడువారిపాలెం, దగ్గుబాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)ల ద్వారా కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారుల మాటలు నమ్మి వ్యాపారులకు అమ్ముకోవడం వలన రైతులు నష్టపోతారన్నారు. వ్యవసాయ భూములకు యూనిక్ నమోదు చేసుకోవాలన్నారు. బిందుమాధురి పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం) పంటను రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి. వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఇంకొల్లు గ్రామంలో క్షేత్ర దినోత్సవం సందర్భంగా పొగాకు ప్రత్యామ్నాయంగా వేసిన శనగ రైతులతో మాట్లాడారు. శనగ పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. ఎంపీటీసీ రావి పేరయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



కొప్పరపాడులో మినుము పైరు పరిశీలిస్తున్న కుమారి

యద్దనపూడి: వేసవిలో పంటల అనంతరం లోతుగా దుక్కులు దున్నుకోవటం ద్వారా బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని వ్యవసాయాధికారి మేరమ్మ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో దుక్కులను వాలుకు అడ్డంగా దున్నుకోవటం ద్వారా వర్షపునీరు భూమిలోకి ఇనికి భూమి చల్లబడుతుందన్నారు. వీఏఏ సుదర్శన, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ: మాగాణి భూముల్లో సాగు చేసిన మినుములో పల్లాకు తెగులు ఆశించిందని నివారించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్వీపీ కుమారి సూచించారు. మంగళవారం కొప్పరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, గ్రామాల్లో మినుము పైరును పరిశీలించి ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మాట్లాడారు. కొమ్మినేనివారిపాలెం సొసైటీలో కందులు, శనగలు, కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చారని క్వింటా, కందులు రూ. 7550, శనగలు రూ. 5650, కొనుగోలు చేస్తారని 12 శాతం లోపు తేమశాతం ఉండాలని పంటను అమ్ముకునే రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రబీలో సాగు చేసిన వివిధ పంటల వ్యర్థాలను తగలబెట్టకుండా దుక్కిలో కలియదున్నాలన్నారు.

ప్రజాధనం చెత్తపాలు



చెత్తకుండీలుగా మారిన నాడెప్ ఎరువు తయారీ యూనిట్



సావరపాలెంలో అలంకారప్రాయంగా మిగిలిన యూనిట్లు

- చెత్తకుండీలుగా మారిన నాడెప్ కంపోస్టు యూనిట్లు
- టార్గెట్ల కోసం నిర్మించారు.. ఆపై వదిలేశారు

చీరాల టౌన్: రైతులు క్రిమిసంహారక మందులు వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడెప్ కంపోస్టు తయారీ యూనిట్లు గ్రామాల్లో చెత్త కుండీలుగా మారాయి. ఈ కంపోస్టు యూనిట్ల వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు, రైతులకు వివరించడంలో వ్యవసాయ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు తీవ్రంగా విఫలయ్యారనడానికి ఈ చిత్రాలే నిదర్శనం. నాడెప్ కంపోస్టు యూనిట్లు గ్రామాల్లో డస్‌బిన్లు (చెత్త కుండీలుగా) మారాయి. రైతులకు మేలు చేయడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించే ఈ యూనిట్లకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి ప్రభుత్వం నిధులు కేటాయించి నిర్మాణాలు చేసినా అవి కేవలం కాగితాలకే పరిమితం అయి వినియోగానికి దూరమయ్యాయి. కేవలం ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు తమ నిర్మాణాల టార్గెట్ల కోసమే వీటిని నిర్మించి చేతులు దులుపుకున్నారు. ఫలితంగా అవి ఎందుకు పనికి రాకుండా పోయాయి. మండలంలోని పశుపోషకులు, రైతులు అధికంగా ఉన్న ఈపూరుపాలెం పంచాయతీలోని సావరపాలెం, బోయినవారిపాలెం, తోటవారిపాలెం, పెర్లవారిపాలెం, కీర్తివారిపాలెం, చీరాలనగర్, విజయనగర్‌కాలనీ, బుర్లవారిపాలెం, కావూరివారిపాలెం తదితర గ్రామపంచాయతీల్లో వేల రూపాయలు వెచ్చించి నిర్మించిన యూనిట్లు చెత్త నిల్వ చేసే స్థావరాలుగా మారాయి. ప్రజలు వాటిని చెత్తకుండీలుగా వినియోగిస్తున్నారు. వ్యవసాయం చేసే రైతులకు ఆర్థికంగా ఇబ్బందులను తొలగించడంతో పాటు సాగులో సేంద్రియ ఎరువులను వినియోగించేందుకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో వ్యవసాయశాఖ సమన్వయంతో వర్మీకంపోస్టు, నాడెప్ యూనిట్ల తయారీకి గత టీడీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. చీరాల మండలంలోని 15 గ్రామపంచాయతీల్లోని రైతులకు నాడెప్ ఎరువు తయారీ యూనిట్లు 249 కేటాయించారు. సగటున రైతులు అధికంగా ఉన్న ఒక్కో పంచాయతీకి 22 చొప్పున వీటిని విభజించారు. నాడెప్ ఎరువు యూనిట్ ఒక్కోదాని నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10,150 కేటాయించింది. లక్షల రూపాయల ప్రజాధనాన్ని నేలపాలు చేసిన ఘనత వారికే దక్కింది. టీడీపీ ప్రభుత్వానికి ఆర్భాటాలు ఎక్కువ.. ప్రజా ఉపయోగాలు తక్కువగా ఉన్నాయి. అదే కోవలో అధికారుల తీరు కాస్తా పలు విమర్శలకు తావిస్తోంది. గ్రామాల్లో నిర్మించిన నాడెప్ యూనిట్లు ప్రస్తుతం ఎరువుల తయారీ ప్రారంభించకముందే గ్రామాల్లోని ప్రజలు వీటిని చెత్తకుండీలుగా వినియోగించడం విశేషం. యూనిట్ల ఏర్పాటు వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించడంలో అధికారులు పూర్తిగా విఫలం కావడం వలనే వీటిని గ్రామస్తులు చెత్తకుండీలుగా వినియోగిస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ ఎరువుల తయారీని అధికారులు విస్మరించారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి ఈ నాడెప్ ఎరువుల యూనిట్లు ప్రారంభిస్తే రైతులకు మేలు చేకూరుతుంది.

స్వయం సహాయక సంఘాల వృద్ధి ముఖ్యం

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకుని.. మొబైల్ బుక్ కీపింగ్ నిర్వహించాలని వెలుగు ఏపీఎం కె.మధుసూదన్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో ఏపీఎం సమావేశాన్ని నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల వీఏవోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతినెలా 10వ తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూళ్లు చేయాలని తెలిపారు. పొదుపు గ్రూపులు.. రుణాల చెల్లింపులో అలసత్వం వహించకూడదని తెలిపారు. గ్రూపుల ఆర్థిక ప్రగతిపై వీఏవోలు ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో రుణాలు అందించడంతో పాటు వాయిదాలు క్రమంగా చెల్లించేలా కృషి చేయాలన్నారు.

అపరాల కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మోహనరావు

పర్చూరు(చినగంజాం): మండలంలోని కొత్తపాలెం, చెరుకూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్ రామ్మోహనరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఏడీఏ ఎన్. మోహనరావు మాట్లాడుతూ రైతులు తాము పండించిన అపరాల పంటలను తక్కువ ధరకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం శనగలను క్వింటాకు రూ. 5650, మినుములను రూ. 7400, పెసరలను రూ. 8682కు మార్క్‌ఫెడ్ సొసైటీల ద్వారా కొనుగోలు చేస్తారన్నారు. పర్చూరు మండలంలో అడుసుమల్లి, గొల్లపూడి, అన్నంబొట్ల వారిపాలెం, వీరన్న పాలెం, బోడవాడ, రమణాయపాలెంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. వ్యవసాయాధికారి రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ రైతు గుర్తింపు కార్డు పొందవచ్చు అని తెలిపారు. భూములు ఖాళీగా ఉన్నప్పుడు జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు చల్లి భూసారాన్ని వృద్ధి చేసుకోవాలని చెప్పారు. అధికారులు కొత్తపాలెం గ్రామంలో సాగు చేసిన నూతన వంగడం పెసర పంటలను సందర్శించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. వీఏఏలు నాగబాబు, ఆదర్శ గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు

చీరాల టౌన్: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని తహసీల్దార్ కె.గోపికృష్ణ సూచించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలోని సమావేశపు హాలులో రెవెన్యూ ఉద్యోగులతో మాట్లాడారు. మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి జవాబుదారీగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందించే రెవెన్యూ సేవలను అందరికీ అందించాలని కోరారు. భూసమస్యల అర్జీల విచారణ నిష్పక్షపాతంగా చేయాలన్నారు. వీఆర్వోలు వారికి కేటాయించిన గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను అందించాలని కోరారు. డీటీ డి.అర్జున్, ఆర్‌ఐలు శేఖర్, సత్యం, మండల సర్వేయర్ బ్రాహ్మణయ్య, వీఆర్వోలున్నారు.

ఫెర్టిలిటీ సెంటర్‌ను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ



ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

చీరాల రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల రోడ్డులోగల ప్రీతి సంతాన సాఫల్య కేంద్రాన్ని (ఫెర్టిలిటీ సెంటర్) ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ విజయమ్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలోని వైద్య పరికరాలతో పాటు పలు రికార్డులను ఆమె నిశితంగా పరిశీలించి ఆస్పత్రి నిర్వాహకులు వైద్యులకు కొన్ని సలహాలు, సూచనలు అందించారు. ఐవీఎఫ్ పద్ధతిలో టెస్ట్‌ట్యూబ్ బేబి ద్వారా సంతానం లేని దంపతులకు సంతాన సాఫల్యం కోసం వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ ప్రీతి డీఎంహెచ్‌ఓకు వివరించారు. అనతరం డీఎంహెచ్‌ఓ పట్టణంలోని మరికొన్ని ఆస్పత్రులను తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో వెంట గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత, డాక్టర్ ఎం. రాజేష్, రేడియాలజిస్ట్ డాక్టర్ పి. దినేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

చీరాల: చీరాలలోని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌ను డీఎంహెచ్‌ఓ విజయమ్మ మంగళవారం పరిశీలించారు. హాస్పిటల్ భవనాన్ని, హాస్పిటల్‌లో అందిస్తున్న వైద్యసేవల విభాగాలు, ఐసీయూ, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, వైద్య విభాగాలను పరిశీలించారు. ఆమె వెంట డాక్టర్ రవికిరణ్, సిబ్బంది ఉన్నారు.

ప్రతిభా పరీక్షలతో ఉపయోగం

అద్దంకి: ప్రతిభా (టాలెంట్) పరీక్షలతో విద్యార్థుల్లోని ప్రతిభను కొలవచ్చని ఎంఈఓ బి. సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో టాలెంట్ పరీక్షను నిర్వహించారు. ఐదో తరగతి విభాగంలో తిమ్మాయపాలెం ఎంపీపీఎస్ విద్యార్థి జీఎల్ సాయి శ్రీ. ప్రథమ స్థానంలో నిలిచింది. పేరాయిపాలెంకు చెందిన రిషిక్ తేజ్ రెండో స్థానం, కలవకూరుకు చెందిన టి. యాంతోని మూడో స్థానంలో నిలిచినట్లు ఎంఈఓ తెలిపారు. 8వ తరగతిలో శ్రీ ప్రకాశం ప్రజభుత్వం బాలికల పాఠశాలకు చెందిన డి. మనీషా, తిమ్మాయపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పి. తమస్ సూర్య రెండో స్థానం, ధేనువకొండకు చెందిన అపర్న మూడో స్థానంలో నిలిచారు. ధర్మవరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. శ్రీనివాసరావు, బొమ్మనంపాడు హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి, చక్రాయపాలెం హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు గొరకాయపాలెం హెచ్‌ఎం ఎల్. సుజాత పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

అద్దంకి: రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి అని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె. ధనరాజ్ అన్నారు. బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ ప్రతి రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకష్ణ మాట్లాడుతూ మండలంలో 9345 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులున్నారని ఇప్పటి వరకు 7200 మంది మాత్రమే ప్రత్యేక గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన రైతులు కూడా ఈ నెల 31 లోపు ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లేకపోతే పీఎం కిసాన్ లబ్ధి చేకూడదని తెలిపారు. మద్దతు ధర క్వింటా రూ. 5650 గా నిర్ణయించినట్లు తెలిపారు.

సై టీబీ పరీక్షతో టీబీ నిర్ధారణ

మార్కాపురం: సై టీబీ పరీక్షతో టీబీ సోకిందో లేదో నిర్ధారించవచ్చని సీనియర్ వైద్యాధికారి డాక్టర్ కె.రాహుల్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఏఎన్ఎంలకు, ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించి సై టీబీ టీకా పరీక్ష చేసే విధానం గురించి వివరించారు. టీబీ సోకిన వ్యాధిగ్రస్తులకు, మందులు వాడే వారికి గతంలో 500 రూపాయలు ప్రభుత్వం అందించిందని, ఇప్పుడు 1000 రూపాయలకు ప్రభుత్వం పెంచిందని అరవింద ఘోష్ వీధిలోని ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శ్రవణ్‌తేజ తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి నగర్ పీహెచ్‌సీ డాక్టర్ శివారెడ్డి, ఎస్‌టీఎల్‌ఎస్ గోవిందరాజులు, టీబీ హెల్త్ విజిటర్ లక్ష్మీరెడ్డి, ఏఎన్ఎం, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



రైల్వేస్టేషన్ వద్ద శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శక్తి బృందాలు

చీరాల: శక్తి యాప్ మహిళలకు అండగా రక్షణగా ఉంటూ ఆపద సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని చీరాల డీఎస్పీ మొయిన్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం పాఠశాల, కళాశాల విద్యార్థినులకు, మహిళలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో శక్తి బృందాలు సందర్శించి ప్రభుత్వం మహిళల భద్రత కోసం అందుబాటులోకి తెచ్చిన శక్తి యాప్‌పై చీరాల సబ్‌డివిజన్ శక్తి బృందం ఇన్‌చార్జి ఎస్సై హరిబాబు అవగాహన కల్పించారు.